
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 6 । జూన్ । 2025



సోమశిలలో 41.210 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 41.210 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 3,280, ఉత్తర, దక్షిణ కాలువలకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,157
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,432
నవర (8 గ్రాములు)	రూ.75,456

గరిష్టం/కనిష్టం
39.3 /30.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు జిల్లాలో క్రమంగా మళ్లీ పెరుగుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ గురువారం 38 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

• ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు రూరల్: డీఎస్సీ పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేసి, బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎండతీవ్రత దృష్ట్యా అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులను పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌వోకు సూచించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, డీఈఓ బాలాజీరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత, కావలి, నెల్లూరు ఆర్డీవోలు వంశీకృష్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో 42 మందికి స్థానచలనం

నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖలో భారీగా నాన్ టీచింగ్ ఉద్యోగులు బదిలీ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 42 మంది అధికారులు, ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ కావాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖాధికారులు ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బి.పద్మ కుమారిని ప్రకాశం జిల్లా ఒంగోలు విద్యాశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వి.విజయ కుమార్ నెల్లూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. జిల్లా విద్యాశాఖలో ఏపీ ఓపెన్‌స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌కే అసదుల్లాఖాన్ కర్నూలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా బదిలీ అయ్యారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, 17 మంది సీనియర్ అసిస్టెంట్లు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, ఐదుగురు ఆఫీసు సబార్డినేటర్లు, గార్డెనర్-1, వాచ్‌మన్-1 వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

డీసీపల్లిలో 506 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం 506 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 622 బేళ్లు రాగా వాటిలో 506 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 65174.7 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,52,29,337.80 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.280 కాగా కనిష్ట ధర రూ.180 లభించింది. మొత్తం మీద సగటు ధర రూ.233.67గా నమోదయింది. వేలంలో 9 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

9న జెడ్పీ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈనెల 9వ తేదీన బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ విద్యారమ తెలిపారు. ఐదేళ్లు పైబడిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఏఓలు, పరిపాలనాధికారులు, సీనియర్, జూనియర్ సహాయకులు, టైపిస్టులు, రికార్డు, ల్యాబ్ లైబ్రరీ సహాయకులు, ఆఫీసు సబార్డినేటర్లను బదిలీలు చేయనున్నారు. దీనికి సంబంధించి సీనియార్టీ జాబితాను కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. ఉద్యోగులందరూ కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలని, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, ప్రసన్నకుమార్‌లు కోరారు.

ప్లీజ్.. కంకర క్వారీకి లీజ్ వద్దు

ఉదయగిరి రూరల్: మండలంలోని తిరుమలాపురం గ్రామ సమీపంలో ఉన్న కొండను కంకర క్వారీకి లీజుకు ఇవ్వవద్దని గురువారం పలువురు గ్రామస్తులు తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 178 సర్వే నంబరులోని 123.50 ఎకరాల విస్తీర్ణం గల కొండ పోరంబోకు భూమిని ప్రభుత్వం కంకర క్వారీ తవ్వకానికి లీజుకు ఇచ్చేందుకు గ్రామంలో ఏ-1 నోటీసు జారీ చేసిందన్నారు. కొండకు దగ్గరగా నివాస గృహాలు ఉన్నాయని, లీజు ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలను ముంచిన బాబు సర్కారు

- జిల్లాలో ఆడబిడ్డ నిధికి అర్హులైన మహిళలు 6.10 లక్షల మంది
- నెలకు రూ.1500 చొప్పున సాయం విస్మరామి
- జిల్లాలో 4.10 లక్షల మంది పొదుపు మహిళలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లూ అందిన సంక్షేమ పథకాలు
- పొదుపు, స్త్రీనిధి, సున్నావడ్డీ, చేయూత, ఆసరా, జగనన్నతోడుతో మహిళల ఆర్థిక స్వావలంబన
- మహిళా సాధికారతను పట్టించుకోని కూటమి
- ఉచిత బస్సు లేదు.. ప్రోత్సాహానికీ దిక్కులేదు
- కోటీశ్వరులను చేసే ప్రచారం కాగితాలకే పరిమితం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): బూటకపు మాటలతో ప్రజలను నమ్మించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీఠమెక్కాక తుంగలో తొక్కారు. కుటుంబంలో ఎంత మంది మహిళలు ఉంటే అంత మంది ఆడబిడ్డలకు ప్రతి నెల రూ.1,500 చొప్పున అందిస్తా. బస్సుల్లో ప్రయాణించేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానంటూ చంద్రబాబు వేదికలెక్కి ఉపన్యసిస్తూ ఊగిపోయారు. చంద్రబాబు మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అనేది మరోసారి రుజువైంది. గతంలో అధికారంలోకి రాక ముందు ప్రతి పొదుపు మహిళ రుణాలు చెల్లించాల్సిన అవసరం లేదు. మీ అన్నగా నేనే చెల్లిస్తానంటూ సెంటిమెంట్‌తో ఓట్లు వేయించుకుని.. ఆ తర్వాత కర్రుకాల్చి వాత పెట్టారు. ఒక్కొక్క మహిళ అప్పట్లో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పొదుపు బకాయిలు ఉంటే పూర్తిగా ఎగ్గొట్టి ఎన్నికల ముందు రూ.10 వేలు పసుపు కుంకుమ అంటూ మోసం చేశారు.

ఈ ఏడాదిలో రూ.1,098 కోట్లు నష్టపోయిన మహిళలు

చంద్రబాబు ఎన్నికల హామీల్లో ప్రతి మహిళకు రూ.1,500 ఇస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలు 6.10 లక్షల మంది ఉన్నారు. హామీ అమలు చేయకపోవడంతో మహిళలకు ప్రతి నెలా రూ.91.50 కోట్లు, ఏడాదికి రూ.1098 కోట్లు జిల్లాలోని మహిళలు నష్టపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీ నిధి రుణాలు, సున్నా వడ్డీ, చేదోడు, చేయూత, జగనన్న తోడు, తదితర సంక్షేమ పథకాల ద్వారా రూ.8,143.45 కోట్ల అందజేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

జిల్లాలో 4.10 లక్షల మంది స్వయం సహాయక గ్రూపు మహిళలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పొదుపు మహిళలే కాదు.. ప్రతి మహిళకు పెద్దపీట వేసింది. ప్రతినెలా ఏదోక సంక్షేమ కార్యక్రమంతో మహిళలకు గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. జిల్లాలో ప్రతి కార్యక్రమం మహిళల పేరుతో అమలు చేశారు. ఇంటి పట్టాలు, ఇతర రుణాలు, ప్రతి సంక్షేమ కార్యక్రమాలు మహిళలకు అందజేశారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి వారి అభివృద్ధికి పెద్దపీట వేసింది. స్వయం సహాయక గ్రూపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వందల కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసింది. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రత్యేక దృష్టి సారించింది. మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి కుటీర పరిశ్రమల స్థాపనకు భారీ స్థాయిలో ప్రోత్సహించింది.



సున్నా వడ్డీకి ఎగనామం

ఈమె పేరు డి.నాగలక్ష్మి. ఊరు వెంకటాచలం మండలం సర్వేపల్లి. చాలా ఏళ్లుగా సర్వేపల్లి పొదుపు సంఘంలో సభ్యురాలుగా కొనసాగుతున్నారు. ఎన్నో పర్యాయాలు పొదుపు సంఘం తరఫున బ్యాంకులో రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎదిగారు. గత ప్రభుత్వంలో తీసుకున్న రుణాలకు ఠంచనుగా సున్నావడ్డీ సొమ్ము బ్యాంకులో పొదుపు రుణాలకు జమయ్యేది. కూటమి ప్రభుత్వంలో సున్నా వడ్డీ పథకం అమలు చేయడం లేదని నాగలక్ష్మి వాపోతున్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు అందిన సాయం

రూ. 8,143.45 కోట్లు

చంద్రబాబు మోసానికి నెలనెలా మహిళలు నష్టపోతున్న మొత్తం

- రూ. 91.50 కోట్లు

వైఎస్సార్‌సీపీ పాలన:

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అప్పటి వరకు పొదుపు మహిళల రుణం మొత్తాన్ని నాలుగేళ్లలో తిరిగి వారి ఖాతాల్లోనే జమ చేశారు. గతంలో టీడీపీ చేసిన మోసానికి డీఫాల్టర్లు అయిన పొదుపు గ్రూపులకు బ్యాంకుల ద్వారా తిరిగి రుణాలిప్పించి.. ఆ గ్రూపుల్లోని మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి చేసేందుకు విస్తృతంగా పొదుపు రుణాలు, స్త్రీ నిధి రుణాలు కల్పించి అత్యధిక మంది జీవితాలను మెరుగుపర్చారు. సున్నావడ్డీ, చేయూత, ఆసరా, జగనన్నతోడు వంటి పథకాలతో వారి ఆర్థిక స్వాతంత్ర్యానికి దన్నుగా నిలిచారు. అమ్మఒడి వంటి పథకాన్ని కూడా వారి ఖాతాల్లోనే జమ చేశారు. ప్రతి కుటుంబానికి జగనన్న కాలనీల్లో రూ.లక్షల విలువైన ఆస్తిని సొంతం చేశారు.

కూటమి పాలన:

బాబూ షూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ అంటూ అబద్ధపు ప్రచారంతో అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మహిళలకు తీరని అన్యాయం చేసింది. బాబు ఋరిడీతో మహిళల భవిష్యత్ ఛిన్నాభిన్నమైంది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 సాయం అందిస్తానని, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని చెప్పిన హామీలు నెరవేర్చకపోగా, పొదుపు, స్త్రీ నిధి రుణాలకు కొర్రీలు పెట్టారు. కొత్త రుణాలు ఇవ్వడం లేదు. ఇక గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అటకెక్కించారు. సకాలంలో పొదుపు చెల్లించిన మహిళలకు సున్నావడ్డీ ఊసే లేదు. మహిళలను కోటీశ్వరులను చేస్తానంటూ పీ-4 పథకంలో కొత్త గారడీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్యాంకర్లు మహిళలకు కొత్త రుణాలిచ్చేందుకు విముఖత చూపుతున్నారు.

ఆశపెట్టి మోసం చేశారు



ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేసి నెలకు రూ.1,500 వంతున ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. పైగా ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికీ ఇస్తామని నమ్మబలికారు. ఆశ పెట్టి ఇవ్వకుండా చేయడం మోసం చేసినట్టే. ఇకనైనా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి. రూ.వేల కోట్ల అప్పులు తెస్తున్నా.. మహిళలకు ఇచ్చిన హామీ మాత్రం నెరవేరడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ మోసపూరిత వాగ్దానాలుగా మారిపోతున్నాయి.

– పిడుగు నీలవేణి, సీతారామపురం

వ్యాపారి నుంచి పారిశ్రామికవేత్త వరకు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు అందించిన ఆర్థిక సహకారంతో ఎంతో మంది వ్యాపారి నుంచి పారిశ్రామికవేత్తలుగా మారారు. సుమారు 1.20 లక్షల మంది మహిళలు కుటీర పరిశ్రమలు స్థాపించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందారు. కూటమి సర్కార్ నయవంచన వల్ల మహిళలు తీవ్రంగా నష్టపోయారు. గతంలో ప్రతి నెలా ఏదో ఒక పథకం పేరుతో మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యేది. ప్రస్తుతం కూటమి పాలనలో ఏడాది నుంచి మహిళలకు ఎటువంటి నగదు అందడం లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంత మహిళలు సూక్ష్మ సంస్థలో రుణాలు తీసుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

- చేజర్లకు చెందిన ప్రమీలమ్మ 14 ఏళ్లుగా పొదుపు గ్రూపులో సభ్యురాలిగా ఉంటోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శిక్షణ తీసుకుని బ్యాంకు రుణం ద్వారా ఊరగాయ పచ్చళ్ల పరిశ్రమ స్థాపించారు. ప్రస్తుతం ఆమె ఆర్థికంగా నిలదొక్కుకోవడంతోపాటు పది మందికి ఉపాధి కల్పిస్తోంది.
- రాపూరుకు చెందిన ప్రసన్నలక్ష్మిది నిరుపేద కుటుంబం. పొదుపు గ్రూపులో సభ్యురాలిగా చేరి పొదుపు చేసుకుంటూ వచ్చిన నగదుతో పిల్లలను చదివించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో శిక్షణ పొంది బ్యూటీ పార్లర్ స్థాపించారు. ప్రస్తుతం దాని ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని అభివృద్ధి చెందుతున్నారు.

పొదుపు రుణాలు (రూ.5,544.54 కోట్లు)

సంవత్సరం	పొదుపు గ్రూపుల సంఖ్య	నగదు రూ.కోట్లలో
2018-19	25,045	814.55
2019-20	33,408	1,087.60
2021-22	24,552	1,192.43
2022-23	27,941	1,273.59
2023-24	26,723	1,176.37

వైఎస్సార్ సున్నా వడ్డీ (రూ.202.35 కోట్లు)

సంవత్సరం	గ్రూపుల సంఖ్య	నగదు రూ.కోట్లలో
2019-20	2,9310	58.73
2020-21	3,2894	50.75
2021-22	3,4238	52.61
2022-23	3,3869	40.26

స్త్రీ నిధి రుణాలు (రూ.492.70 కోట్లు)

సంవత్సరం	సభ్యుల సంఖ్య	రుణాలు రూ.కోట్లలో
2020-21	22,625	109.61
2021-22	44,519	149.75
2022-23	33,175	113.18
2023-24	20,519	120.16

వైఎస్సార్ ఆసరా (రూ.853.69 కోట్లు)

సంవత్సరం	గ్రూపుల సంఖ్య	నిధులు రూ.కోట్లలో
2020-21	26,626	210.97
2021-22	27,004	213.32
2022-23	27,252	215.40
2023-24	27,081	214

వైఎస్సార్ చేయూత (రూ.927.66 కోట్లు)

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నిధులు రూ.కోట్లలో
2020-21	1,04,597	196.12
2021-22	1,07,906	202.32
2022-23	1,43,521	269.09
2023-24	1,42,551	260.13

జగనన్న తోడు (రూ.122.51 కోట్లు)

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	నగదు రూ.కోట్లలో
మొదటి విడత	16,151	16.15
రెండో విడత	18,052	18.05
మూడో విడత	29,957	29.96
4వ విడత	16,923	16.92
5వ విడత	27,007	27.01
6వ విడత	15,138	14.42

ప్రకృతిని కాపాడుకుందాం



• ఇన్‌చార్జి కలెక్టర్, కమిషనర్

నెల్లూరు(బారకాసు): ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కార్పొరేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 'ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్' అంశంపై అవగాహన ర్యాలీని గురువారం ఉదయం నిర్వహించారు. స్థానిక వీఆర్ కళాశాల కూడలి నుంచి ర్యాలీని కార్తీక్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న వారితో కలెక్టర్ ప్రతిజ్ఞను చేయించారు. నార సంచులను పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, నడక పోటీలు, మారథాన్ వంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. ర్యాలీలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్, నగరపాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏలో బదిలీల గందరగోళం

నెల్లూరు (పొగతోట): డీఆర్‌డీఏలో బదిలీల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. సెర్ప్ అధికారులు 10 మంది సీనియార్టీ జాబితాను జిల్లా అధికారులకు పంపించారు. వారు ఆ జాబితాను పక్కన పెట్టి అర్హులైన వారిని బదిలీ చేయకుండా ఇటీవల కాలంలో బదిలీలు అయిన వారిని మరో పర్యాయం బదిలీలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. గతంలో ఐదు సంవత్సరాలు పూర్తయిన వారిని ఇతర మండలాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం సెర్ప్ ఆదేశాల మేరకు జోన్ పరిధిలో బదిలీలు జరుగుతున్నాయి. సెర్ప్ అధికారులు పంపించిన సీనియార్టీ ప్రకారం పది మంది ఇతర జిల్లాలకు బదిలీ కావాల్సి ఉంది. ఇందుకు ఇష్టపడని డీఆర్‌డీఏ ఉద్యోగులు అధికార పార్టీ నాయకుల అండదండలతో చక్రం తిప్పుతున్నారు. గతంలో బదిలీ అయిన ఏపీఎంలను ఇతర జిల్లాలకు బదిలీలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. హెల్త్ గ్రౌండ్స్ కింద కొంత మందికి బదిలీల్లో మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంది. అటువంటి వాటిని ఏమీ పరిగణలోకి తీసుకోవడం లేదంటూ డీఆర్‌డీఏ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ

- నేటి నుంచి 30 వరకు డీఎస్సీ పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో 8 సెంటర్లలో
- పోస్టులు 673.. దరఖాస్తులు 31,221
- జిల్లాలో 700కు పైగా స్కూల్ అసిస్టెంట్ల మిగులు
- ఉద్యోగం సాధించినా పోస్టింగ్‌పై అనుమానాలు

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన మెగా డీఎస్సీపై అభ్యర్థుల్లో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. నోటిఫికేషన్ తరువాత తగినంత సమయం ఇవ్వక పోవడం, అర్హత మార్కులను పెంచి ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 700కు పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగులు ఉంటే డీఎస్సీ అభ్యర్థులకు ఎక్కడ నుంచి పోస్టులు ఇస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో 117 ఎస్జీటీ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేశారు. ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు ఎస్జీటీ పోస్టులకు క్వాలిఫైయింగ్‌కు అర్హతైన ఇంటర్‌లో 50 శాతం మార్కులు, స్కూల్ అసిస్టెంట్‌ల పోస్టులకు క్వాలిఫైయింగ్‌కు అర్హతైన డిగ్రీలో 50 శాతం మార్కులు నిబంధనలను అమలు చేసింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు అర్హత శాతాన్ని 45 నుంచి 40 వరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో మాకు కూడా తగ్గించాలని ఓపెన్ కేటగిరి అభ్యర్థులు డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే కొంతమంది అభ్యర్థులకు సుదూర ప్రాంతాల్లో సెంటర్లు కేటాయించారు. చెన్నై, తిరుపతి, ఒంగోలు తదితర సెంటర్లు కేటాయించారు. ఒక్కో అభ్యర్థి నాలుగైదు పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడంతో ఒకే రోజు, ఒకే సమయానికి రెండు పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉంది. ఈ రీతిలో డీఎస్సీ అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో వేలాది మంది అభ్యర్థుల్లో పోస్టుల ఆందోళన నెలకొంది.

నార్మలైజేషన్‌పై ఆందోళన

డీఎస్సీ పరీక్షల నిర్వహణలో నార్మలైజేషన్‌పై పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని ఎస్జీటీలు అందరికీ ఒకే రోజు పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్‌లకు సంబంధించి ఒక సబ్జెక్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కూడా ఒకే రోజు పరీక్ష నిర్వహించాలని చెబుతున్నారు. ఒక సబ్జెక్టు లేదా ఎజ్జీటీలకు ఎక్కువ రోజులు పరీక్ష నిర్వహించడం వల్ల ప్రశ్నాపత్రంలో మార్పు వస్తుందన్నారు. ఒకరోజు సులభంగా మరొక రోజు కష్టంగా రావడంతో యావరేజీ తీసుకోవడం వల్ల కొంత మంది అభ్యర్థులు నష్టపోతారని చెబుతున్నారు.



కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు (ఫైల్)

నేటి నుంచే పరీక్షలు

డీఎస్సీ పరీక్షలు ఈనెల 6వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లాలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోటలోని ఎన్‌బీకేఆర్‌లో రెండు సెంటర్లు, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల నెల్లూరు, గూడూరు, పొట్టేపాలెంలోని అయాన్ డిజిటల్ సెంటర్, కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, కావలిలోని ఆర్‌ఎస్ఆర్, పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 31,221 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్‌లలో జరుగుతాయి.

ఒక్కో పోస్టుకు 46 మంది పోటీ

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం 673 పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని జిల్లా పరిషత్తు, ప్రభుత్వ, మున్సిపాల్టీ, మండల ప్రజా పరిషత్తులో 668 పోస్టులు, మిగిలిన 5 పోస్టులు ట్రైబల్ ఆశ్రమ పాఠశాలల్లో ఉన్నాయి. మొత్తం 673 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. ఒక్కో పోస్టుకు 46 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అయితే జిల్లాలో 700కు పైగా స్కూల్ అసిస్టెంట్లు మిగులు ఉన్నట్లు జిల్లా అధికారులు లెక్కలు తేల్చారు. ఎజ్జీటీ పోస్టులు కూడా కేవలం 117 ఖాళీలు ఉన్నట్లు లెక్కలు చెప్పారు. దీంతో డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎక్కడ నుంచి పోస్టులు తీసుకువస్తారని ప్రశ్నిస్తున్నారు.

పకడ్బందీగా పరీక్షలు

శుక్రవారం నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లును పూర్తి చేశాం. హాల్‌టికెట్‌లో పుట్టిన తేదీ, జన్మస్థలం, పేరు తదితర వాటిల్లో పొరబాట్లు ఉంటే పరీక్ష రోజున సెంటరులో చీఫ్ సూపరింటెండెంట్ వద్ద ఉన్న నామినల్ రోల్స్ సరిచేసుకోచ్చు. హాల్ టికెట్‌లో ఫొటో లేకుంటే రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, గుర్తింపు కార్డును తీసుకురావాలి. అభ్యర్థులు వారికి కేటాయించిన సెంటర్లకు సకాలంలో చేరుకోవాలి.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

క్లుప్తంగా

గంజాయి అక్రమ రవాణాపై దాడులు

- నలుగురు నిందితుల అరెస్ట్
- 48 కేజీలు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): తిరుపతికి గంజాయి అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ దయాసాగర్ ఆదేశాల మేరకు గురువారం ఎక్సైజ్ నెల్లూరు – 2 ఇన్‌స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కాలేషావలీ తమ సిబ్బందితో కలిసి వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి తిరుపతికి వెళ్తున్న కారును తనిఖీ చేశారు. డిక్కీలో మూడు ప్లాస్టిక్ సంచుల్లో 48 కేజీలున్న 192 గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన శివ ప్రసాద్ మిషాల్, బంధువులు పూజా మిషాల్, కాన్హు ప్రసాద్ మిషాల్, స్నేహితుడు బుదుపంగిని అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ నెల్లూరు – 2 స్టేషన్‌కు తరలించి విచారించారు. నిందితులు ఒడిశా రాష్ట్రం ఇంగాలి గ్రామానికి చెందిన బలరామ్ దాలి వద్ద రూ.50 వేలకు గంజాయిని కొనుగోలు చేసి తిరుపతిలో అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు నలుగురు నిందితులతోపాటు బలరామ్ దాలిపై కేసు నమోదు చేశారు. నలుగురిని అరెస్ట్ చేసి రూ.5 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, గంజాయి, కారును సీజ్ చేశారు. తనిఖీల్లో పాల్గొన్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు మునీర్ అహ్మద్, శకుంతల, సిబ్బందిని ఏసీ దయాసాగర్ అభినందించారు.

కళాశాలపై విచారణ

కందుకూరు రూరల్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో గాయత్రి జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల జవాబుపత్రాలు ట్యాంపరింగ్ జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఇంటర్ బోర్డు విచారణ కమిటీని నియమించింది. పరీక్ష కేంద్రమైన శ్రీవివేకా జూనియర్ కళాశాలలో గురువారం కమిటీ విచారణ చేపట్టింది. విచారణాధికారిగా ఉన్న బోర్డు డిప్యూటీ సెక్రటరీ జయలక్ష్మి కళాశాల యాజమాన్యాన్ని, ఇన్విజిలేటర్‌ను విచారించారు. బాధిత విద్యార్థులైన ఎం.అవినాష్‌బాబు, టి. సాయితేజస్వినిని, తల్లిదండ్రులు, గాయత్రి కళాశాల యాజమాన్యం నుంచి స్టేట్‌మెంట్ తీసుకు న్నారు. ఈ కళాశాలకు చెందిన ఇషాక్, ప్రజ్ఞ అనే విద్యార్థులు కూడా మార్కులు తగ్గాయని, తమ జవాబుపత్రాలు కూడా ట్యాంపరింగై ఉంటాయ నే అనుమానం ఉందని పరిశీలించాలని ఫిర్యాదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

సంక్షేమంపై చిన్నచూపు

వసతి గృహాల్లో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి

- సకాలంలో పూర్తికాని మరమ్మతులు
- ఇళ్లకు వెళ్లిపోతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను చిన్నచూపు చూస్తోంది. దీంతో వాటిల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతులకు వేసవిలో శ్రీకారం చుట్టారు. అయితే మేనెల అయిపోయినా తూతూమంత్రంగా జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యమైన వసతులను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. అక్కడక్కడా ప్యాచ్ వర్కులను చేసి, మరుగుదొడ్లకు తలుపులను బిగించి మమ అనిపించేశారు. చేరడానికి వచ్చిన విద్యార్థులు ఏవో కారణాలు చెప్పి ఇళ్లకు వెళ్లిపోతున్నారు.



మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న ఓ హాస్టల్లో పూత పనులు చేశారిలా..



6 హాస్టళ్ల సముదాయంలోని మొదటి బిల్డింగ్

జిల్లాలో ఇలా..

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 12 కళాశాలల హాస్టళ్లు, 59 ప్రీమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో మరమ్మతులను వేసవి సెలవుల్లో ప్రారంభించారు. 64 ప్రభుత్వ భవనాల కోసం రూ.9.38 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నెల్లూరు నగరంలోని పది వసతి గృహాల్లో వివిధ పనుల కోసం రూ.87.15 లక్షల నిధులిచ్చారు. ఏప్రిల్ నెలలోనే ఇందుకు సంబంధించిన పనులు మొదలుపెట్టారు. అయితే సెలవులు అయిపోయి కళాశాలలు తెరవడంతో హాస్టళ్లకు విద్యార్థులు రావడం మొదలుపెట్టారు. పనులు పూర్తి కాకపోవడంతో చాలా మంది తిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మద్రాస్ బస్టాండ్ వద్దగల హాస్టళ్ల కాంప్లెక్స్‌లో ఆరు వసతి గృహాలున్నాయి. ఒక్కో దాంట్లో ఒక్కో రకమైన పని చేయాల్సి ఉంది. అయితే వారికి అందుబాటులో ఉండే పూత పనులు, చిన్న చిన్న సిమెంట్ పనులు, మరుగుదొడ్ల తలుపులు మార్చడంను చేశామంటే చేశామన్నట్లు వ్యవహరిస్తున్నారు.

పూర్తయ్యే పరిస్థితి లేదు

ఈనెల 12వ తేదీన ప్రీ మెట్రిక్ విద్యార్థులు హాస్టళ్లలో చేరాల్సి ఉంది. అయితే పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. సాంఘిక సంక్షేమ శాఖాధికారులు గత నెలాఖరులోపు పనులు అయిపోవాలని చెబుతున్నారు. కాంట్రాక్టర్లు మాత్రం జూన్ నెలంతా కూడా తాము పనులు చేసుకోవచ్చని చెప్పుకొస్తున్నారు. మొత్తంగా సాంఘిక సంక్షేమ శాఖాధికారులు, వార్డెన్లు, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ప్రణాళికాబద్ధంగా మరమ్మతులు చేయలేకపోవడంతో ఏ హాస్టళ్లలో ఏ మేరకు పనులు జరిగాయో ఎవరికీ తెలియని పరిస్థితి. దీనికితోడు ఏ పనులు జరుగుతున్నాయో బయట చెప్పొద్దంటూ హుకుం జారీ చేశారని ప్రచారం ఉంది. ప్రస్తుతం వసతి గృహాల్లో నెలకొన్న పరిస్థితులపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తుండగా..

- మినీలారీల పట్టివేత
- ఆగని సరఫరా



పోలీసులు పట్టుకున్న లారీ

కొడవలూరు: చేపల గుంతలకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మినీలారీని కొడవలూరు ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి గురువారం పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. మండలంలోని ఆలూరుపాడు చేపల గుంతలకు గురువారం వ్యర్థాలను తరలిస్తున్నారు. దీనిపై అజ్ఞాత వ్యక్తుల సమాచారం మేరకు ఎస్సై కోటిరెడ్డి వాహనాన్ని పట్టుకున్నారు. గుంత తీయించి వ్యర్థాలను పూడ్చివేశారు. సీజ్ చేసిన వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల చేసేది లేదని, వ్యర్థాల అక్రమ రవాణాను నిలిపివేయాలని ఎస్సై హెచ్చరించారు.

- **విడవలూరు:** మండలంలోని తుమ్మగుంట గ్రామంలో చికెన్ వ్యర్థాల వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నరేష్ కథనం మేరకు.. బెంగళూరు నుంచి మినీలారీలో వ్యర్థాలను వావిళ్ల వైపు తరలిస్తున్నట్లు ఫిషరీ అసిస్టెంట్ కడిబేటి నాగరాజుకు గురువారం సమాచారం అందింది. దీంతో పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీలు చేసి వ్యర్థాలను గుర్తించారు. గుంత తీయించి పూడ్చిపెట్టారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమాని దంపూరుకు చెందిన ఏటూరు మురళిపై కేసు నమోదు చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకున్నారు.

జగన్‌ను మోసం చేసిన చరిత్ర మీది

- వీపీఆర్ దంపతులపై ప్రసన్న ఫైర్



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

కోవూరు: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీకు చాలా గౌరవం ఇచ్చారు. అటువంటి మనిషిని మోసం చేసిన చరిత్ర మీది' అంటూ వీపీఆర్ దంపతులపై వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఫైరయ్యారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీపీఆర్‌కు ఇచ్చిన గౌరవం మరెవరికీ ఇవ్వలేదన్నారు. అయినా వెన్నుపోటు పొడవడంలో వారు డాక్టరేట్ పొంది ఉన్నారన్నారు. వెన్నుపోటు దినం విజయవంతం కావడంతో దానిని జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వైఎస్సార్‌సీపీపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన వారిని లక్షలాది రూపాయలు కుమ్మరించి కొనుగోలు చేసుకుని మీ వెనుక తిప్పుకోవడం జరిగిందన్నారు. అసలు వెన్నుపోటుదారులను మీ వెనుక పెట్టుకుని మాట్లాడటం సరికాదన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్ అభిమానులను పక్కనపెట్టి నెల్లూరు నుంచి నలుగురు బ్రోకర్లను వెనుక వేసుకుని తిరుగుతున్నట్లు చెప్పారు. అసలైన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు తీవ్ర అవమానం జరుగుతుందన్నారు. వెన్నుపోటు దినంలో రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు రావడం జరిగిందన్నారు. దానిని చూసి ఓర్చుకోలేకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడిచి బయటకు వెళ్లింది మీరు కాదా అని ప్రశ్నించారు. వేమిరెడ్డిని చంద్రబాబు ఏ విధంగా అవమానించారో మీరు మరిచిపోయినా మేము మరచిపోలేమన్నారు. మీ చుట్టూ ఉన్న వారంతా మా పార్టీ వాళ్లే కదా.. మా పార్టీలో గెలిచి నీ డబ్బులకు అమ్ముడుపోయారన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరిచలపతి మాట్లాడుతూ వెన్నుపోటు దినం విజయవంతం కావడంతో అధికార పార్టీలో ఆందోళన మొదలైందన్నారు. జన సమూహాన్ని చూసి వీపీఆర్ కుటుంబానికి చలిజ్వరం పట్టుకుందన్నారు. అసలు వెన్నుపోటుదారులు వీపీఆర్ దంపతులన్న విషయం రాష్ట్రం మొత్తం తెలుసన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. వీపీఆర్ దంపతులకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా చంద్రబాబు చెప్పిన అబద్ధాలను పట్టించుకోకుండా తమ సొంత నిధులతోనైనా కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రాధాకృష్ణారెడ్డి, అనూప్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, నరసింహులు రెడ్డి, మల్లికార్జునరెడ్డి, దినేష్‌రెడ్డి, మల్లికార్జున్, ఆదినారాయణరెడ్డి, లక్ష్మీకుమారి, జ్యోతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై కేసులా?



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి, పక్కన రాజగోపాల్‌రెడ్డి

- ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- రాజగోపాల్‌రెడ్డితో కలిసి కాకాణితో ములాఖత్

వెంకటాచలం: హామీలను అమలు చేయడంలేదని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. చెముడుగుంట వద్ద నున్న జిల్లా జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా ఉన్నవారిపై, ప్రజా సమస్యలపై బలంగా పోరాడే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజల స్పందన చూస్తే, కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమైందన్నారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ నేర్పుతున్న విద్యలే భవిష్యత్‌లో పునరావృతం అవుతాయనే విషయాన్ని గుర్తించుకోవాలని హెచ్చరించారు. గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్రంలో పని చేసేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా భయపడే పరిస్థితులు కల్పిస్తున్నారన్నారు.

పోలీసుల దౌర్జన్యం


- పూలకొట్టు తొలగింపు విషయంలో ఉద్రిక్తత
- వైఎస్సార్‌సీపీ నేతను బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు



రఫీని తీసుకెళ్తున్న పోలీసులు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి దేవాలయం ప్రాంగణంలోని షాపుల తొలగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ కందుకూరు పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ పూలకొట్టు తొలగింపు విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు రఫీని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. ఆలయ ప్రాంగణంలో 24 షాపులను నిర్మించి అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు వేలం ప్రక్రియను చేపట్టారు. ఈనెల 7వ తేదీన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేయనున్నారు. ఇందులో భాగంగా ఓవీ రోడ్డు వైపున్న షాపులను, తోపుడు బండ్లను తొలగించే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఆ ప్రాంతంలో ఉన్న రఫీ పూలకొట్టును తొలగించే విషయంలో పోలీసులు దౌర్జన్యానికి దిగారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సాంబశివయ్యలు షాపును తొలగించాలని కోరారు. సమయం ఇవ్వాలని, ఇప్పటికిప్పుడు తొలగించాలంటే ఎలా కుదురుతుందని రఫీ అడిగారు. శుక్రవారం సాయంత్రానికి తీసేస్తానని చెప్పారు. కానీ పోలీసులు మాత్రం ఇప్పటికే సమాచారం ఇచ్చామని, షాపును తొలగించాల్సిందేనంటూ పట్టుపట్టారు. దీంతో ఇరువురు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రఫీని అదుపులోకి తీసుకున్న పోలీసులు నేరుగా పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్టేషన్‌కు చేరుకుని రఫీని పరామర్శించాయి.

కండలేరులో 39.422 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 39.422 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.